
సాక్షి ఒడిశా

సోమవారం । 17 । మార్చి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.8,09,117లు, బంగారం 2 గ్రాముల 200 మిల్లీగ్రాములు, వెండి 42 గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



బాడీబిల్డింగ్ పోటీలు

పర్లాకిమిడిలో బాడీ బిల్డింగ్ పోటీలు జరిగాయి. ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

- 8లో



రమాకాంత రథ్ అస్తమయం

ప్రసిద్ధ కవి రమాకాంత్‌రథ్ కన్నుమూశారు. నేడు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

శ్రీ మందిరంలో రహస్య కెమెరా



రహస్య కెమెరాతో పోలీసులకు చిక్కిన నిందితుడు

భువనేశ్వర్: పూరీ జగన్నాథ దేవస్థానం శ్రీ మందిరంలో రహస్య (స్పై) కెమెరా వ్యవహారం బయటపడింది. దేవస్థానం లోపలి ప్రాకారంలో దృశ్యాలు స్పై కెమెరాలో చిత్రీకరిస్తుండగా యువకుడు పట్టుబడ్డాడు. సింహ ద్వారం ఠాణా పోలీసులు నిందిత యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు 26 ఏళ్ల భాస్కర్ సామంత అని పేర్కొన్నారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య రహస్య కెమెరాతో శ్రీ మందిరం లోనికి ఎలా ప్రవేశించాడు అనేది సంచలనం రేపుతోంది. ఈ దిశలో పోలీసులు నిందితుడికి ప్రశ్నిస్తున్నారు. మరో వైపు పోలీసులు కెమెరాను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శ్రీ మందిరం లోనికి కెమెరాల చొరబాటు, అభ్యంతరకర వీడియో చిత్రీకరణ, సాంఘిక మాధ్యమాల్లో చట్ట వ్యతిరేక ప్రసారాలు షరా మామూలుగా మారిపోయాయి.

ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



కొట్‌పాడ్ కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. కొట్‌పాడ్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ (ఎన్.ఎ.సి) ప్రాంతంలో అతడిని కొంత మంది రక్షించి హాస్పిటల్‌లో చేర్చారు. ఆ వ్యక్తి వివరాలు తెలిసిన వారు కొట్‌పాడ్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

కొరాపుట్‌లో వాల్తేర్ డీఆర్‌ఎం పర్యటన



వాల్తేర్ డీఆర్‌ఎం లలిత్ బోరాకి వినతి పత్రం సమర్పిస్తున్న మాజీ ఎంఎల్‌ఏ నిమయ్ సర్కార్

కొరాపుట్: వాల్తేర్ డీఆర్‌ఎం లలిత్ బోరా కొరాపుట్ జిల్లాలో పర్యటించారు. ఆదివారం కొరాపుట్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు, అమృత్ భారత్ పురోగతి తదితర పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొరాపుట్–కొత్త వలస మధ్యలో మిగిలి ఉన్న డబ్లింగ్ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే నిమయ్ సర్కార్ డీఆర్‌ఎంకి వినతి పత్రం సమర్పించారు. కొత్తవలస–కిరండోల్ రైల్వే మార్గంలో కొరాపుట్ జిల్లా నందపూర్, లమ్తాపుట్ సమితుల్లో దాదాపు 10 చిన్న వంతెనలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా ప్రాంతాలలో గిరిజనులు పడుతున్న సమస్యలు డీఆర్‌ఎంకి వివరించారు.

కాటేసిన పాముతోనే ఆస్పత్రికి..!



ఆస్పత్రి ప్రాంగణంలో పాము కాటు బాధితుడు కర్మాకర్

భువనేశ్వర్: మయూర్‌భంజ్ జిల్లా నాగ్‌పాల్ గ్రామానికి చెందిన అజిత్ కర్మాకర్‌ను ఇంటి ఆవరణలోనే నాగుపాము నాలుగుసార్లు కాటేసింది. అయితే భయపడకుండా ధైర్యం చేసి పామును కర్రతో కొట్టి చంపేశాడు. అనంతరం పామును పట్టుకొని ఉదొలా పట్టణంలోని ఆస్పత్రికి వచ్చారు. వైద్యులు విషయాన్ని తెలుసుకొని పామును పరిశీలించారు. అనంతరం కర్మాకర్‌కు చికిత్స అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ.. కర్మాకర్‌కు నాగుపాము కాటేసినట్టు గుర్తించి చికిత్స చేశామన్నారు. అయితే అతని పరిస్థితి ఇంకా విషమంగానే ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బరిపదా ఆస్పత్రికి రిఫర్ చేశామన్నారు.

దొరికినంత మోసుకెళ్లారు



ఘటనా స్థలంలో సహాయక చర్యలు



ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా తుళ్లిన ద్రాక్ష పండ్లు





ప్రమాద దృశ్యం

జాజ్‌పూర్ జిల్లా మూలపాలొ కూడలి సమీపంలో ద్రాక్ష పండ్లు రవాణా చేస్తున్న ట్రక్కు ఆదివారం ప్రమాదానికి గురైంది. ద్రాక్ష పండ్లు తీసుకెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఐషర్ వాహనాన్ని అతి వేగంతో బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కువాఖియా ఠాణా పోలీసులు ఘటనా స్థలం చేరి పరిస్థితిని పర్యవేక్షించారు. రెండు వాహనాలు ముఖాముఖి ఢీనడంతో ట్రక్కులో లోడు అయి ఉన్న ద్రాక్ష పండ్లు చెల్లా చెదురుగా తుళ్లాయి. వీటిని స్థానికులు దొరికినంత మూటగట్టుకుని మోసుకుని పోయారు.

భువనేశ్వర్

టెన్త్ విద్యార్థి ఆత్మహత్య!



చెట్టుకొమ్మకు వేలాడుతున్న విద్యార్థి మృతదేహం

మల్కన్‌గిరి: విద్యార్థి మామిడి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి నీలాకంబేరీ పంచాయతీ సోర్లుకొండ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామ శివారులోని పొలం వద్ద మామిడి చెట్టు కొమ్మకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసిన స్థానికులు బలిమెల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఐఐసీ దీరాజ్ పట్నాయక్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని చెట్టు నుంచి కిందికి దింపించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చనిపోయిన బాలుడు ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షలు రాశాడు. ఫలితాల కోసం వేచిచూస్తున్నాడు. ఇంతలో ఏమి జరిగిందో శవమై తేలాడు. విద్యార్థి మృతిపై అనుమానాలు ఉండడంతో మృతదేహన్ని మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్టు పోలీసులు తెలిపారు. సోమావారం కోరాపుట్ నుంచి సైటిఫిక్ బృందం వస్తేకాని బాలుడు మృతికి కారణాలు తెలియరావన్నారు.

త్వరలో ఒంటిపూట బడులు



ఉమ్మర్‌కోట్‌లో మిత్రులతో కలిసి రోడ్డుపక్కన టీ తాగుతున్న విద్యాశాఖ మంత్రి నిత్యానంద గొండో



బైక్ మీద తిరుగుతున్న మంత్రి నిత్యానంద గొండో

● విద్యాశాఖ మంత్రి నిత్యానంద వెల్లడి

కొరాపుట్: వేసవి నేపథ్యంలో త్వరలోనే పాఠశాలలకు ఒంటిపూట అమలు చేస్తామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ, విద్యాశాఖా మంత్రి నిత్యానంద గొండో ప్రకటించారు. ఆదివారం ఉదయం తన స్వంత నియోజకవర్గమైన నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్‌లో పర్యటించారు. ఎటువంటి ఆర్భాటం లేకుండా బైక్ మీద కలియతిరిగారు. పలు చోట్ల వేడిమి గుర్తించారు. మీడియాతో మాట్లాడారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. తాను వెంటనే భువనేశ్వర్ వెళ్లి విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించి పాఠశాలలకు ఒంటిపూట తేదీలను ప్రకటిస్తామని మంత్రి నిత్యానంద గొండో ప్రకటించారు.

మాజీ ఎంపీ ప్రదీప్ మఝి కుల బహిష్కరణ

కొరాపుట్: బీజేడీ నాయకుడు, మాజీ ఎంపీ ప్రదీప్ మఝిని పన్నెండేళ్ల పాటు కుల బహిష్కరణ చేయడం కలకలం రేపుతోంది. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి దమనాగుడ గ్రామంలో బోత్ర కుల సమాజ్ కేంద్ర కమిటీ అత్యున్నత సర్వ సభ్య సమావేశం అత్యవసరంగా బేటీ అయింది. 12 ఏళ్ల పాటు ప్రదీప్ కుటుంబంలో కష్టసుఖాల కార్యక్రమాలకు బోత్ర జాతి వారు దూరంగా ఉంటారని కమిటీ ప్రకటించింది. గిరిజనుల తెగలో బోత్ర కులంలో పుట్టిన ప్రదీప్ జాతి నియమాలు విడిచి ఈ నెల 12వ తేదీన కేంద్ర పడ జిల్లాకి వేరే కులం అమ్మాయిని పెళ్లి చేసుకున్నారని కమిటీ ఆరోపించింది. గతంలో కూడా ప్రదీప్ కుటుంబంలో మహిళని బ్రాహ్మణ కులంలో పుట్టిన వ్యక్తి కి వివాహం జరిపారని గుర్తు చేశారు. పదే పదే బోత్ర కుల నియమాలు ఉల్లంఘిస్తున్నందుకు ప్రదీప్‌తో పాటు అతని తండ్రి మాజీ ఎంపీ భగవాన్‌ను కూడా బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కాలంలో కూడా ఇంకా కుల బహిష్కరణలు చేస్తుండడం పలువురిని ఆశ్చర్యపరిచింది. వాస్తవానికి కుల బహిష్కరణ చట్టవిరుద్ధం కూడా.

స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్‌లో 75 మంది పేర్లు నమోదు



ఓపెన్ స్కూల్ ప్రారంభోత్సవ వేదికపై హెచ్‌ఎంతో పాటు అతిథులు

జయపురం: స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్‌లో 2025–26 విద్యాసంవత్సరానికి 75 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజ్య ముక్త విద్యాలయ ప్రతిష్టాన్ కార్యక్రమంలో భాగంగా.. స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలు 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలను ఆదివారం ప్రారంభించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ప్రకాశ్ చంద్ర పట్నాయిక్ అధ్యక్షత వహించారు. ఈ బడి వల్ల స్కూలు మానేసిన వారికి మళ్లీ చదువుకునే అవకాశం లభిస్తుందన్నారు.

గులిమి జలాశయంలో ఇద్దరు గల్లంతు



ఇద్దరు గల్లంతైన గులిమి జలాశయ ప్రాంతం

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితి గులిమి పర్యాటక కేంద్రం జలాశయంలో ఇద్దరు గల్లంతైనట్లు సమాచారం. సమాచారం అందిన వెంటనే కొట్‌పాడ్ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన వారు చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు.

ముగిసిన జైనమత ప్రవచనాలు



జయపురం నుంచి తిరిగి వెళ్తున్న జైన సాధువులు

జయపురం: జయపురంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న జైనమత ప్రవచనాలు ఆదివారంతో ముగిశాయి. దీంతో ప్రవచనాలు బోధించిన జైనమత సాధువులు ఇక్కడ నుంచి పయనమై వెళ్లిపోయారు. వీరంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ఒడిశాలోని కొరాపుట్ జిల్లా సరిహద్దులు దాటుకొని వందలాది కిలోమీటర్లు పాదయాత్ర చేసుకుంటూ జయపురం వచ్చారు. జయపురంలో ఉన్న జైన మందిరంలో జైన సంప్రదాయ ప్రజలకు మత పరమైన ప్రవచనాలు బోధించారు. వీరికి స్థాని జైన సంఘ ప్రతినిధులు కొంత దూరం వరకు సాగనంపారు.

డ్యామ్‌లో జారిపడి యువకుడు మృతి



కొరాపుట్: ప్రమాదవశాత్తు డ్యాంలో పడి యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితి పకోజొల డ్యాంలో ఆదివారం చోటుచేసుకోగా శంకర్ పాడాల్ (25) మృతి చెందాడు. స్నేహితులతో కలిసి స్నానం కోసం డ్యాం వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు జారిపడి పోయాడు. సహచరులు అతనిని వెలికి తీసి కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శంకర్ పాడాల్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు నందపూర్ సమితి పాడువా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అట్టండా గ్రామ పంచాయతీ బాసుర్ గ్రామానికి చెందిన లింగా పడాల్ కుమారుడు. సిమిలిగుడలో ఒక ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు.

నాటు తుపాకీ పేలి వ్యక్తి మృతి

పర్లాకిమిడి:



హరిచంద్ర భుయ్యాన్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గజపతి జిల్లా మోహనా పోలీసుస్టేషన్ పరిధిలో కుంకుని పోదా సాహి ప్రాంతంలో నాటుతుపాకీ పేలి వేటగాడు మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్‌డీపీవో అమితాబ్ పండా తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి కొద్ది దూరంలో శనివారం రాత్రి తుపాకీ పేలిన శబ్దం వినిపించడంతో స్థానికులు అక్కడికి వెళ్లి చూసేసరికి వ్యక్తి మృతి చెందిఉన్నట్టు తెలిపారు. ఘటనాస్థలంలో మృతదేహం పక్కన నాటు తుపాకీతో పాటు మందుమాత్రలు ఉన్నాయన్నారు. తుపాకీ పేలడంతో మృతుడి ఉదరభాగంతోపాటు రెండు చేతులకు తీవ్రంగా గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. మృతుడు రాయఘడ ఠానా పరిధిలోని సందిబా గ్రామానికి చెందిన హరిచంద్ర భుయ్యాన్‌గా గుర్తించారు. మృతుని భార్య ద్రౌపదీ భుయ్యాన్ ఫిర్యాదు మేరకు మోహనా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీ మందిరం ఆవరణలో భారీ కొవ్వొత్తి





పూరీ శ్రీ మందిరం ఆవరణలో ఆదివారం భారీ కొవ్వొత్తి వెలిగించారు. ఒక భక్తుడు కోరిన కోరికలు ఫలిస్తే 5 అడుగుల ఎత్తు కొవ్వొత్తి వెలిగిస్తానని స్వామిని మొక్కుకున్నాడు. కోరిన ప్రకారం జరగడంతో ఈ భారీ కొవ్వొత్తి వెలిగించి మొక్కు తీర్చుకున్నట్లు వివరించాడు. అయితే శ్రీ మందిరం సేవాయత్ పర్యవేక్షణలో అరుణ స్తంభం ప్రాంగణంలో 5 అడుగుల కొవ్వొత్తి వెలిగించడం కొన్ని వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి.

- భువనేశ్వర్

సిమిలిగుడలో భారీ వర్షం



కైలాష్‌నగర్‌లో రోడ్లపై పారుతున్న వర్షపు నీరు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. డ్రైనేజీలు నిండిపోయి మురుగునీరు రోడ్లపైకి పోటెత్తింది. కై లాష్‌నగర్‌లో వీధులు జలమయమయ్యాయి. అకాల వర్షంతో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడ్డారు.

రైల్వే పనులకు రూ.3.30 కోట్ల మంజూరు

పర్లాకిమిడి: నౌపడా–గుణుపురం–తెరువళ్లి డబ్లింగ్ రైల్వే పనులకు కేంద్ర రైల్వే బోర్డు 165 కిలో మీటర్ల లైన్‌కు రూ.3.30 కోట్లు మంజూరు చేశారు. ఈ మేరకు ఈస్టుకోస్టు రైల్వే జనరల్ మేనేజర్ భువనేశ్వర్‌కు కేంద్ర రైల్వే బోర్డు(న్యూఢిల్లీ) దీపక్ సింగ్ తెలియజేశారు. అతి త్వరలో గుణుపురం నుంచి తెరువళ్లికి డబ్లింగ్, ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్.ఎల్.యస్.) పనులు ప్రారంభమవుతాయని రైల్వే అధికారులు తెలియజేశారు.

ఆ బాలిక ఎవరో..?



శొశాహండిలో తిరుగున్న బాలిక

జయపురం: ఒక బాలిక గత మూడు రోజులుగా జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి శొశాహండి గ్రామంలో తిరుగుతోంది. స్థానికులు ఏం అడుగుతున్నా చెప్పలేకపోతోంది. ఆ బాలికను ఎవరైనా గుర్తిస్తే ఆ బాలికను ఆమె తల్లిదండ్రులకు అప్పజెప్పేందుకు ప్రయత్నిస్తారు. సమాచారం తెలిసిన వారు 8018657655 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.

ప్రమాద స్థలం పరిశీలన



పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల: లావేరు మండలం, బుడుమూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని ఆదివారం ఉదయం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.

ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు



మిస్టర్ ఒడిశా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో డెనిమ్ జీన్స్ టాల్ విభాగంలో పాల్గొన్న బాడీ బిల్డర్స్

పర్లాకిమిడి: రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు పర్లాకిమిడిలో రాయల్ జిమ్, ప్రపంచ ఫిట్‌నెస్ ఫెడరేషన్ సంస్థ కలిసి నిర్వహించడంపై జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతి రావు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక బిజూ కల్యాణ మండపం ఓపెన్ స్టేడియం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీలకు జ్యూరీ సభ్యులుగా కళింగ బాడీబిల్డింగ్ అధ్యక్షుడు రాజన్ మహంతి, గౌరవ అతిథులుగా దివ్యజ్యోతి సాయంతరాయ్, సాధారణ కార్యవర్గ సభ్యులు సుబ్రత్ సాహు, మాజీ కళింగ బాడీ బిల్డింగ్ చాంపియన్ స్వాధీన్ సింగ్‌లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో డెనిమ్ జీన్స్ టాల్ విభాగంలో రుద్ర మల్లిక్ మెమెంటో గెలుచుకోగా, బ్రాంజి మెడల్‌ను పాణిగ్రాహి (పర్లాకిమిడి), ప్రశంసా పత్రాన్ని సౌమ్యా దాస్ గెలుచుకున్నారు. తుది రౌండ్స్‌లో విన్నర్స్‌కు నగదు బహుమతి ఉంటుందని న్యాయ నిర్ణేత రంజన్ మహంతి తెలియజేశారు. ఈ కార్యక్రమం రాయల్ జిమ్ నిర్వాహకులు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది.



మిస్టర్ ఒడిషా డెనిమ్ జీన్స్ షార్టు విభాగంలో బ్రాంజి విజేత పాణిగ్రాహి ట్రోఫీని అందుకుంటున్న దృశ్యం



డెనిమ్ జీన్స్ శరీరసౌష్టవ చాంపియన్‌షిప్ పోటీల్లో రెండో రౌండ్‌లో పాల్గొన్న బాడీ బిల్డర్స్



మిస్టర్ ఒడిశా డెనిమ్ జీన్స్ షార్టు విభాగంలో ట్రోఫీని అందుకుంటున్న రుద్రమల్లిక్

కవి రమా కాంత రథ్ అస్తమయం



పద్మ భూషణ్ రమా కాంత రథ్

భువనేశ్వర్: ఒడియా సాహిత్యంలో సిద్ధ ఆధునిక కవులలో ఒకరుగా నిలిచిన పద్మభూషణ్ రమా కాంత రథ్ (91) ఆదివారం స్థానిక ఖారవేళ నగర్‌లోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. కెత్తె దినొరొ, ఒనేకొ కొఠొరి, సందిగ్ధ మృగయ, సప్తమ ఋతు, సచిత్ర ఒంధారొ ఆయన ప్రముఖ రచనల్లో కొన్ని మచ్చుతునకలు. ఆయన సాహిత్య పటిమతో పలు ప్రతిష్టాత్మక బహుమానాలు, పురస్కారాలు, సత్కారాల్ని సొంతం చేసుకున్నారు.

1977 సంవత్సరంలో సాహిత్య అకాడమీ అవార్డు, 1992లో సరస్వతి సమ్మాన్, 1990లో బిషుబ్ సమ్మాన్, 2006లో భారతదేశపు తృతీయ అత్యున్నత పౌర పురస్కారం పద్మ భూషణ్‌తో శోభిల్లారు. ఆయన 1993 నుంచి 1998 వరకు భారత సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షుడిగా, 1998 నుంచి 2003 వరకు న్యూఢిల్లీలోని భారత సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా పనిచేశారు. కటక్‌లో జన్మించిన రమాకాంత రథ్ 1957లో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ (ఐఏఎస్)లో చేరడానికి ముందు రెవెన్షా కళాశాల నుంచి ఆంగ్ల సాహిత్యంలో పోస్టు గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత సాధించారు. విద్య, ఉద్యోగ రంగాల్లో అంచెలంచెలుగా అత్యున్నత శిఖరాల్ని అధిరోహిస్తూ రచనా ప్రవృత్తిని నిరంతరం కొనసాగించారు. భారత ప్రభుత్వ కార్యదర్శి వంటి కేంద్ర ప్రభుత్వంలో అనేక ముఖ్యమైన పదవులను నిర్వహించిన తర్వాత ఆయన ఒడిశా ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శిగా పదవీ విరమణ చేశారు.

ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారం

పద్మ భూషణ్ రమాకాంత రథ్ మృతిపై రాష్ట్ర గవర్నరు డాక్టరు కంభంపాటి హరిబాబు, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, విపక్ష నేత నవీన్ పట్నాయక్, ఒడిశా ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్, పలువురు రాష్ట్ర, కేంద్ర మంత్రులు, పేరొందిన సాహితీవేత్తలు, రచయితలు ఇతరేతర వర్గాలు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. రమాకాంత రథ్ అంత్య క్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. పూరీ స్వర్గ ద్వార్ తీరంలో సోమవారం ఆయన అంత్య క్రియలు నిర్వహించనున్నారు.

బాలికపై అత్యాచారం.. ఒకరి అరెస్టు



నిందితుడు గగన ప్రధాన్

జయపురం: బాలికను అపహరించి ఆమెపై అత్యాచారం జరిపాడన్న నేరారోపణపై ఒక యువకుడిని అరెస్టు చేసినట్లు మహిళా పోలీసు స్టేషన్ అధికారిణి ఆశ్రిత ఖల్కో ఆదివారం వెల్లడించారు. నిందితుడు జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి హటపాదర్ గ్రామం గగన ప్రధాన్ ఉరఫ్ జొగ(21) అని వెల్లడించారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. బాలికది బొరిగుమ్మ సమితిలో ఒక గ్రామం. ఫిబ్రవరి మొదటి వారంలో ఒక రోజు పగలు ఆ బాలిక ఇంటి నుంచి బయటకు వచ్చిందని, నిందితుడు గగన వచ్చి ఆ బాలికను అపహరించుకుపోయాడని తెలిపారు. బాలిక ఇంటికి రాకపోవటంతో ఆమె తల్లిదండ్రులు అన్ని చోట్ల వెతికారని, అనంతరం బాలిక తల్లి జయపురం మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు.

ఫిబ్రవరి 10 వ తేదీన కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, ఎట్టకేలకు బాలికను కనుగొని ఆమెను రక్షించి ఆమె వాంగ్మూలం రికార్డు చేసి బాలికను సిడబ్ల్యూసీ విభాగానికి అప్పజెప్పామని తెలిపారు. నిందితుడు అప్పట్లో పరారై పోగా.. ఇప్పటికి పట్టుకున్నామన్నారు.

35 పోషణ కేంద్రాల ఏర్పాటు చర్యలు

- సంక్షేమశాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్రో

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పోషణ కేంద్రాలను ప్రారంభించనుంది. గుజరాత్ తరహాలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. రాష్ట్రంలో ప్రజలకు ఈ కేంద్రాల్లో సబ్సిడీ ధరలకు నిత్యావసర సరుకులు విక్రయించాలని భావిస్తున్నట్లు ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో ఆది వారం ప్రకటించారు. ఆర్థికంగా బలహీన వర్గాలు, మధ్య తరగతి కుటుంబాలకు మద్దతు ఇవ్వడమే లక్ష్యంగా మంత్రి పేర్కొన్నారు. ఈ కేంద్రాల్లో బియ్యం, పప్పులు, పిండి, వంట నూనె వంటి ముఖ్యమైన నిత్యావసరాల సరుకులు తక్కువ ధరలకు విక్రయించడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పోషణ్ కేంద్రాలు నిర్వహిస్తాయి. ప్రయోగాత్మక చర్యలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తొలి విడత కింద 35 పోషణ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రయత్నం విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీలకు వీటిని విస్తరిస్తామని మంత్రి వెల్లడించారు. గుజరాత్‌లో ఈ కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతుంది. దాని కార్యాచరణ నమూనాను అధ్యయనం చేయడానికి రాష్ట్రం నుంచి అధికారుల బృందం గుజరాత్ రాష్ట్రాన్ని సందర్శిస్తుందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం అవసరమైన విధానాలను ఖరారు చేసి, సమీప భవిష్యత్తులో పోషణ కేంద్రాల ఏర్పాటు విస్తరించడంపై నిర్ణయం తీసుంటామని మంత్రి ప్రకటించారు.

మరోచోట దంపతులకు ప్రమాదం..

బూర్జ: మండలంలోని శ్రీకాకుళం–పాలకొండ ప్రధాన రహదారిలో కొరగాం గ్రామ మలుపు వద్ద ఆదివారం ఉదయం టిప్పరు–మోటారు బైక్ ఢీ కొని దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పోలీసులు తెలియజేసిన వివరాలు ప్రకారం.. మండలంలోని ఏబీసీ పేటకు చెందిన భుగత చంద్రశేఖర్, భార్య భాగ్యలక్ష్మి కలసి శ్రీకాకుళం నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా పాలకొండ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న టిప్పర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలై అపస్మార స్థితికి వెళ్లిపోయారు.స్థానికులు గమనించి 108 వాహన సిబ్బంది సాయంతో శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి మరో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చంద్రశేఖర్ సోదరుడు భుగత మల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాహిత్యం సమాజ మనుగడకు మూలాధారం



సాహిత్య కార్యక్రమంలో పాల్గొన్న సాహిత్య పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు, రచయితలు

జయపురం: సంప్రదాయ సాహిత్యం సమాజ మనుగడకు మూలాధారమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం స్థానిక జగన్నాథ్ సాగర్ పార్క్ ప్రాంతంలో జయపురం సాహిత్య పరిషత్ నిర్వహించిన సాహితీ సమావేశంలో 'సాంప్రదాయ సాహిత్య రుచి బోధ' అన్న అంశంపై చర్చించారు. సాహిత్య పరిషత్ అధ్యక్షుడు హరిహర కరసుధా పట్నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంప్రదాయ సాహిత్య విలువలపై పలువురు ప్రసంగించారు. సంప్రదాయ సాహిత్యం మన ప్రాచీన సంస్కృతిని భావి తరాల వారికి అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో 'అసిలరే సంగ హోళీ'(వచ్చిందిరా సంగ హోళీ) అన్న హాస్యరస కవితా పఠనం నిర్వహించారు. పరిషత్ కార్యదర్శి నిరంజన్ పాణిగ్రహి నిర్వహణలో నిర్వహించబడిన ఈ హాస్య కవితా పఠనంలో పలువురు తమ స్వీయ కవితలు వినిపించి సభికులను కడుపుబ్బా నవ్వించారు. కవితా పఠనంలో కవులు కవయిత్రులు ఔత్సాహిక కవులు కవయిత్రలతో కో ఆర్డినేట్ చేసి శ్వీయ కవితలను సభకు చదివి సమర్పించారు. అనంతరం 'అబీర ఆసరా' కార్యక్రమంలో 40 మందికి పైగా కవులు, కవయిత్రులు తమ కవితలను చదివి వినిపించారు. నేడు రచయితలు సమర్పించిన కవితలను జయపురం సాహిత్య పరిషత్ అధ్యక్షుడు హరిహర కరసుధా పట్నాయక్ సమీక్షించారు. ఈ సాహిత్య కార్యక్రమంలో పరిషత్ ఉపాధ్యక్షుడు డాక్టర్ సుధాంశు పట్నాయక్ ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 31వ తేదీన సంగీత నాటక అకాడమీ జయపురం, సాహిత్య పరిషత్ సంయుక్తంగా సాహితీ సామ్రాట్ విక్రమదేవ్ వర్మ స్మృతి సాహిత్యంపై కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యదర్శి నిరంజన్ పట్నాయక్ వెల్లడించారు.

నేడు మదీనా దర్గా చందనోత్సవం



విద్యుత్ కాంతులతో మదీనా దర్గా

గార: కళింగపట్నం పరిధి నగరాలపేట వద్దనున్న కళింగ హజరత్ మదీనా బాబా దర్గా వద్ద సోమవారం ఉరుసు చందనోత్సవం జరగనుంది. ముందు బాబా సమాధి వద్ద అభిషేకాలను నిర్వహిస్తారు. అనంతరం గత ఏడాది సమాధిపై వేసిన చందనం పూతను తొలగిస్తారు. ఎదురుగా ఉన్న ప్రార్థనా స్థలం వద్ద ముస్లిం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేసిన తర్వాతే భక్తులకు దర్శనం ఉంటుంది. ఇక్కడ ప్రతి గురువారం హిందూ, ముస్లిం భక్తులు పాల్గొని పూజలు చేస్తారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ప్రారంభం కానున్న ఉత్సవంలో సాయంత్రం బాబా సమాధిని కప్పి ఉంచే ప్రధానమైన వస్త్రాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి సమాధిపై ఉంచుతారు.

పలాసలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ పర్యటన నేడు


శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు పలాస, కాశీబుగ్గ, మందస, సమీప మండల కేంద్రాల్లో సోమ, మంగళవారాలు పర్యటించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ కార్యదర్శి ఎన్.పద్మజ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కేజీబీవీలు సందర్శిస్తారని ప్రకటనలో పేర్కొన్నారు.

చోదకా.. నీకే హెచ్చరిక



మండుతున్న ఎండల్లో మృత్యుదేవత రహదారుల వెంబడే తిరుగాడుతోంది. వేడి ధాటికి రోడ్డుపై తారు మరుగుతుంటే.. దూసుకొస్తున్న వాహనాలను బోల్తా కొట్టిస్తోంది. టైరు ఏ మాత్రం పాతదైనా, నాణ్యత కొద్దిగా తగ్గినా బండి బోల్తా కొట్టక తప్పదు. అందుకే వేసవిలో వాహనాల టైర్లు మరోసారి చూసుకోవడం శ్రేయస్కరం. బాగులేకపోతే మార్చుకోవడం, క్రమం తప్పకుండా తనిఖీ చేయించుకోవడం, నైట్రోజన్‌తో గాలి నింపుకోవడం తారక మంత్రాలుగా గుర్తుంచుకోవాని నిపుణులు సూచిస్తున్నారు. – శ్రీకాకుళం క్రైమ్, టెక్కలి, కంచిలి

- వాహనాల్లో టైర్ల సంరక్షణే కీలకం
- తరచూ తనిఖీ చేయించుకోవాలంటున్న నిపుణులు
- నైట్రోజన్ ఎయిర్ తప్పనిసరి
- ఐఎస్‌ఐ మార్కు ట్యూబ్‌లెస్ టైర్ బెటర్



జిల్లాలో వాహన ప్రమాదాలు పెరుగుతున్నాయి. అతివేగం ఓ కారణమైతే నాణ్యత లేని టైర్లు మరో కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం వేసవిలో ఇలాంటి ప్రమాదాలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలకే ప్రమాదం అని చెబుతున్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన ప్రమాదాలు పరిశీలిస్తే టైర్లు పేలడం, పంక్చర్ అవ్వడం కొన్ని స్కిడ్ అవ్వడం కనిపించాయి.

సూచనలు ఇవే..



- వేసవి వేడి పెరిగిన కారణంగా రహదారి బాగా వేడెక్కి కొత్త టైర్లు సైతం పేలే అవకాశాలున్నాయి. కారులో నైట్రోజన్ ఎయిర్ తప్పనిసరిగా ఉండేలా చూడాలి. ఇది రన్నింగ్‌లో టైర్లను కూల్ చేస్తుంది.
- ప్రయాణానికి ముందు టైర్లలో ఎంత ఎయిర్ ప్రెజర్ ఉందన్నదీ తనిఖీ చేసుకోవాలి. కారు మోడల్‌ను బట్టి ఫ్రంట్ సైడ్ డోర్‌లో వివరాలుంటాయి. సాధారణంగా అయితే ఫ్రంట్ టైర్లలో 35–40, బ్యాక్ టైర్లలో 30 వరకు ఎయిర్ ప్రెజర్ ఉంటుంది.
- తరచూ వీల్ ఎలైన్‌మెంట్ కరెక్టుగా ఉందా.. స్టీరింగ్ బాక్స్ కరెక్టుగా ఉందా లేదన్నదీ తనిఖీ చేసుకోవాలి.
- ఐఎస్‌ఐ మార్క్ ఉన్న ట్యూబ్‌లెస్ టైర్లు ఉంటే బెటర్.. చైనా వీల్స్ వాడకపోతేనే మంచిది. రీబటన్ టైర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- కారుల్లో సీటు బెల్టు ముందున్న వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా పెట్టుకోవాలి. లాంగ్ జర్నీ చేసేటప్పుడు ఆరు గంటలకు మించి కంటిన్యూ చేయరాదు.
- స్కూళ్లు, కళాశాలల్లో ఇప్పటికీ పాతరకం బస్సులు నడుపుతుండటం ఈ వేసవిలో అంత శ్రేయస్కరం కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


కొన్ని ప్రమాదాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

- లావేరు మండలం బుడుమూరు హైవే సమీపంలో కారు బోల్తా కొట్టి నలుగురు ప్రాణాలు కోల్పోయారు.
- గత ఏడాది డిసెంబరు 18న కోటబొమ్మాళి మండలం పాకివలస సమీప జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి సెంటర్ డివైడర్‌పై నుంచి అవతలిరోడ్డు వైపునకు వెళ్లి స్కూటీపై వస్తున్న టీచర్‌ను ఢీకొట్టింది.
- అంతకు కొద్ది నెలల ముందు ఇదే మండలం శ్రీపురం సంత సమీప హైవే వద్ద అతివేగంతో వచ్చిన కారు అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు.
- గత ఏడాది డిసెంబరు 24న కంచిలి పెద్దకొజ్జిరియా– చిన్నకొజ్జిరియా సమీప హైవే వద్ద అతివేగంతో వచ్చిన కారు స్కిడ్ అవ్వడంతో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి.
- గత ఏడాది నవంబరు 30న విజయనగరం జిల్లా భోగాపురం వద్ద హైవేపై మితిమీరిన వేగంతో వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్ ఎక్కి ఆవలి రోడ్డువైపునకు వెళ్లి లారీని ఢీకొనడంతో నలుగురు జిల్లావాసులు మృతిచెందారు.
- ఈ ఘటనలు పరిశీలిస్తే ప్రమాదానికి ముందు, తర్వాత టైర్లు పేలడం కనిపించింది.


నిబంధనలు పాటించాలి



రహదారి భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి. కార్లలో ప్రయాణించే వారు అధికంగా కుటుంబీకులే ఉంటారు. నెమ్మదిగా నడిపి సురక్షితంగా గమ్యాన్ని చేరాలి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది నోపార్కింగ్ ఏరియాల్లో బళ్లు నిలపకుండా చూడాలి.


– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

ముందుగానే టైర్లు మార్చుకుంటాను..



నా ఫార్చ్యూనర్ వాహనానికి ఒకే సారి టైర్లు వేయిస్తాను. కాల పరిమితికి ముందుగానే వాటిని మార్చివేస్తాను. ప్రతి రోజూ టైర్ల పరిస్థితి ఏ విధంగా ఉన్నాయో పరిశీలించమని డ్రైవర్‌కు చెబుతాను. వాహనానికి టైర్లు సక్రమంగా ఉంటేనే ఎలాంటి ప్రమాదాలు జరగవు. – ఎస్.మోహన్‌రావు, ఫార్చ్యూనర్ వాహనం యజమాని, టెక్కలి

గాలి చూసుకోవాలి



వాహనాన్ని నడిపే ముందు ఎప్పటికప్పుడు తప్పనిసరిగా టైర్లలో గాలి చూసుకోవాలి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో టైర్లు పేలి తీవ్ర ప్రమాదాలకు దారి తీయడం మనం చూస్తున్నాం. ప్రస్తుతం మధ్య తరగతి కుటుంబాలు ఎక్కువ శాతం కార్లను కొనుగోలు చేస్తున్నారు. వారంతా ఈ విషయాల్ని తప్పనిసరిగా పాటించాలి. – ఇప్పిలి ప్రవీణ్‌కుమార్, కంచిలి

ఆఖరి ప్రయాణం



సారవకోట: సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

మరో కుటుంబంలో 'కారు' చీకటి కమ్ముకుంది. అతివేగం ఇంకో ఇద్దరి ఆయుష్షు రేఖను కుదించేసింది. కొత్తగా రూపుదిద్దుకున్న హైవే రెండు ప్రాణాలను బలి తీసుకుంది. కడదాకా కలిసుందామని బాసలు చేసుకున్న దంపతులకు ఇదే ఆఖరి ప్రయాణమైంది. కాలం ఎంత కర్కశమైందంటే.. అమ్మానాన్న చనిపోతే ఆ విషయం అదే వాహనంలో ఉన్న బిడ్డకు తెలియరాలేదు.

- రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి
- సారవకోట మండలం కురిడింగి సమీపంలో ఘటన



చికిత్స పొందుతున్న కీర్తి విహార్

సారవకోట, పాతపట్నం:

సారవకోట మండలంలోని చిన్నకిట్టాలపాడు పంచాయతీ కురిడింగి గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతపట్నం శ్రీరామ్‌నగర్‌కు చెందిన పెద్దగోపు వెంకటప్రసాద్(56), ఆయన భార్య పెద్దగోపు వాణి(45) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు, స్థానికులు, లారీ డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం..

పాతపట్నం శ్రీరామ్‌నగర్‌కు చెందిన పెద్దగోపు వెంకటప్రసాద్ ఆయన భార్య వాణి, కుమారుడు కీర్తి విహార్ ఒడిశాలోని పర్లాకిమిడి రాజవీధికి చెందిన తులగ హేమలత, ఇంజు చక్రవర్తిలు కలిసి ఆదివారం ఉదయం కారులో శ్రీకాకుళంలో వివాహానికి హాజరయ్యారు. పెళ్లికి హాజరై తిరుగు ప్రయాణంలో సారవకోట మండలం కురిడింగి గ్రామ సమీపానికి వస్తుండగా.. సరిగ్గా మధ్యాహ్నం 3.35 గంటల సమయంలో ఎదురుగా వస్తున్న లారీని వీరి కారు ఢీకొట్టింది. ఆ దెబ్బకు లారీ ముందు యాక్సిల్ విరిగిపోయి ముందు చక్రం డీజిల్ ట్యాంకుకు ఢీకొట్టింది. ఆ ధాటికి కారు డ్రైవింగ్ చేస్తున్న వెంకటప్రసాద్, వెనుక సీట్లో కూర్చున్న భార్య వాణి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు.

అయ్యో ఆ కుటుంబం..

ప్రమాదంలో చనిపోయిన వెంకటప్రసాద్(56) వాణి(45) దంపతులది పర్లాకిమిడిలోని రాజవీధి. వెంకటప్రసాద్ అమరావతి ట్రావెల్స్ బస్సులకు భాగస్వామి. గత ఎనిమిదేళ్లుగా పాతపట్నంలో నివాసం ఉంటున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు విశాల్ అమెరికాలో జాబ్ చేస్తున్నాడు. రెండో కుమారుడైన కీర్తి విహార్ ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఇతను భువనేశ్వర్‌లో బీటెక్ చేస్తున్నాడు. ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడడంతో తల్లిదండ్రులు చనిపోయిన విషయం కూడా చాలా సేపటి వరకు తెలియలేదు.



పెద్దగోపు వెంకటప్రసాద్, వాణి దంపతులు (ఫైల్)

డ్రైవర్‌కు పక్క సీట్లో కూర్చున్న ఇంజు చక్రవర్తికు, వెనుక సీట్లో కూర్చున్న కీర్తి విహార్‌కు, తులగ హేమలతకు తీవ్రగాయాలయ్యాయి. ఘటన జరిగిన వెంటనే స్థానికులు స్పందించి హైవే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి క్షతగాత్రులను పాతపట్నం సీహెచ్‌కు తరలించారు. అనంతరం శ్రీకాకుళం తీసుకెళ్లారు.

అతివేగమే కారణమా..?

- కారు లారీని ఢీకొన్న ధాటికి కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జైపోయింది. కారు భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఎయిర్ బెలూన్స్ ఓపెన్ అయి పాడైపోయాయి.
- లారీ ముందు భాగం యాక్సిల్ విరిగిపోయి డీజిల్ ట్యాంకును సైతం ఢీ కొనడంతో డీజిల్ పూర్తిగా కారిపోయింది.
- ప్రమాదం జరిగిన స్థలంలో ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో లారీ డ్రైవర్, బైక్‌పై అటుగా వస్తున్న పెద్దలంబకు చెందిన శ్రీను, బొంతుకు చెందిన జయరామ్, స్థానికుల సాయంతో కారు డోర్‌ను గునపాలతో పొడిచి తీశారు.
- సంఘటన స్థలాన్ని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, సారవకోట ఎస్‌ఐ అనిల్ కుమార్ పరిశీలించారు. మృతదేహాలను పాతపట్నం సీహెచ్‌సీకు తరలించారు.



నుజ్జయిన లారీ ముందు భాగం

ఆదివారం కాకపోయి ఉంటే..

కురిడింగి ప్రాథమిక పాఠశాల ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. పాఠశాల విడిచిపెట్టే సమయం, ప్రమాదం జరిగిన సమయం ఒకటే కావడం గమనార్హం. ఆదివారం ప్రమాదం జరగడంతో పిల్లలు రోడ్డు మీదకు రాలేదని, లేదంటే మరింత ఘోరం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ సర్వీస్ రోడ్డు లేక పోవడం, హైవే సిబ్బంది పాఠశాల జోన్ అని కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

రామతీర్థంలో వైభవంగా పారాయణం



స్వామి సన్నిధిలో పారాయణం చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో తిరువాయుముజీ పాశురముల పారాయణాలను భక్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అనకాపల్లికి చెందిన ఆచార్య గోష్ఠి బృంద సభ్యులు నాలాయర దివ్య ప్రబంధంలో తిరువాయుముజీ వెయ్యి పాశురాలను స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో పారాయణం చేశారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో ప్రతిభ



భానుప్రసాద్‌కు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీ నాయన

బొబ్బిలి: పట్టణంలోని యాదవ వీధికి చెందిన డీసరి భాను ప్రసాద్ ఏపీ స్టేట్ వెయిట్ లిఫ్టింగ్ 200 కిలోల విభాగంలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈనెల 1,2 తేదీల్లో విశాఖలో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన భాను ప్రసాద్ జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యే అవకాశాలున్నాయని కోచ్‌లు కేతిరెడ్డి సాయి వరుణ్, శంబంగి పురుషోత్తంలు తెలిపారు. భానుప్రసాద్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ సాధించడంతో ఎమ్మెల్యే బేబీ నాయన రూ.20వేలను పోటీల ఖర్చుల నిమిత్తం అందజేశారు.

గొర్రెపోతుల పందాలపై పోలీసుల దాడి

- 8 మంది పందెగాళ్లను అదుపులోకి తీసుకుని 2 గొర్రెపోతులు స్వాధీనం



పందాల్లో పట్టుబడిన గొర్రెపోతులు, జూదరులను చూపుతున్న పోలీసులు

లక్కవరపుకోట: మండలంలోని గొల్జాం గ్రామం శివారులో గల నిర్మానుష్య ప్రాంతంలో రహస్యంగా నిర్వహిస్తున్న గొర్రెపోతుల పందాలపై ఎస్సై నవీన్‌పడాల్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా పందాలు ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ 4,430 నగదు, రెండు గొర్రెపోతులు, రెండు సెల్‌ఫోన్‌లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. దాడుల్లో పలువురు పోలీస్‌లు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై హెచ్చరిక



ఎల్విన్‌పేటలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట గ్రామంలో సర్వే నంబర్ 60(గ్రామకంఠం) సర్వే నంబర్ 58, 61లకు చెందిన స్థలంలో నేతేటి ఈశ్వరరావు అనే గిరిజనేతర వ్యక్తి చేపడుతున్న కట్టడాలు అక్రమమైనవంటూ రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ మేరకు 1/70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరుడు ఎల్విన్‌పేట వద్ద (గుణుపూర్ జంక్షన్) ఎటువంటి అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదంటూ గిరిజనాభ్యుదయ సంఘం నాయకుడు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు పై చర్యలకు ఉపక్రమించారు. ఆ నిర్మాణాలు అక్రమ కట్టడాలుగా గుర్తించామని, నిర్మాణాలు తక్షణమే తొలగించాలని హెచ్చరించారు. తాము జారీ చేసిన హెచ్చరికలను అతిక్రమిస్తే సీసీఎల్ఏ ఆదేశాల మేరకు చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులో పొందుపరిచారు.

ఆటోవాలా డీలా..!

- అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీ నెరవేర్చని కూటమి ప్రభుత్వం
- హామీమేరకు ఏడాదికి రూ.15 వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్
- ఏడాదికి రూ.10 వేలు ఇచ్చి ఆదుకున్న మాజీ ముఖ్యమంత్రి



రామభద్రపురం బాడంగి రూట్ ఆటో స్టాండ్‌లో ప్రయాణికులు లేక ఖాళీగా ఉన్న ఆటోలు



సాలూరు రూటులో ఉన్న ఆటోలు



ప్రయాణికులు లేక ఖాళీగా ఉండి అష్టాచెమ్మ ఆడుకుంటున్న బొబ్బిలి రూట్ ఆటో డ్రైవర్లు

రామభద్రపురం: ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ప్రభుత్వాలు తరచూ డీజిల్ ధరలు పెంచుతూపోవడంతో తిప్పలు తప్పడం లేదు. ఆటో నడపడం ఆపలేక వేరే పనిచేయలేక దీనావస్థలో కొట్టుమిట్టాడుతున్నారు. దైనందిన జీవితంలో సంపాదన లేకపోవడంతో చేష్టలుడిగి చూస్తున్నారు. ఆటో నడిపినా ఏ మాత్రం లాభాలు రాకపోగా చాలీచాలని డబ్బులతో జీవనం ఎలా కొనసాగించాలా? అని మథన పడుతున్నారు. ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర రూ.99 వరకు ఉంది. దీంతో ముఖ్యంగా ఆటోలను నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న డ్రైవర్లు బేంబేలెత్తిపోతున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలోని రామభద్రపురం, బొబ్బిలి టౌన్, బొబ్బిలి రూరల్, బాడంగి, తెర్లాం మండలాల్లో సుమారు 1500 నుంచి 1600 వరకు ఆటోలు ఉన్నాయి. బస్సులు లేనప్పుడు ప్రయాణికులు ఆటోల పైనే ఆధారపడి గమ్యస్థానాలకు చేరుతున్నారు.ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు లేని గ్రామీణ ప్రాంతాలకు ఆటోలే ఆధారం.అయితే ఆటోలు నడిపే కార్మికుల పరిస్థితి మాత్రం అంత ఆశాజనకంగా లేదని ఆవేదన వక్తం చేస్తున్నారు.

తగ్గిన ఆదాయం..పెరిగిన ఖర్చులు..

ఆటోలు నడపడానికి పలు రకాల నిర్వహణ ఖర్చులు ఉన్నాయి. ప్రస్తుతం పెరుగుతున్న డీజిల్, పెట్రోల్ ధరలతో ఆటో కార్మికుడికి రోజంతా కష్టపడితే రూ.200 నుంచి రూ.300 కూడా మిగలని పరిస్థితి నెలకొంది. ప్రతి ఏడాది ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, సర్టిఫికెట్ల కోసం దాదాపు రూ.13 వేల దాకా ఖర్చవుతోంది. వీటితో పాటు తనిఖీల పేరుతో పోలీసులు, రవాణా శాఖాధికారులు దాడులు చేసి వేలాది రూపాయిలు జరిమానా విధించడం, ఆటో కొనుగోలు కోసం తీసుకున్న రుణాలకు నెలవారీ కిస్తీలు కట్టుకోలేక ఆటో కార్మికుల బతుకులు దినదినగండంగా మారిపోయాయి. వచ్చే అరకొర డబ్బులు డీజిల్‌కే పోతున్నాయని వాపోతున్నారు. ప్రస్తుతం చార్జీలకు ఆటోలను నడిపి, నెల వచ్చే సరికి తీసుకున్న ఫైనాన్స్ కట్టలేక ఆటో డ్రైవర్లు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

ఆటో కార్మికులపై కూటమి నిర్లక్ష్యం

కష్టాలలో ఉన్న ఆటో కార్మికులను ఆదుకునే విషయంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆటోకార్మికులు విమర్శిస్తున్నారు. ఆటో కార్మికులకు రూ.15 వేలు చొప్పున ఇస్తామని, ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే హామీలు పరిచిపోయారు.అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా హామీలు అమలు చేయడం లేదని మండిపడుతున్నారు.

జగన్ ప్రభుత్వంలో భరోసా

అప్పోసప్పోచేసి ఆటోలను కొనుగోలు చేసి కుటుంబాన్ని పోషించుకోలేకపోవడం, అప్పుచేసి ఫైనాన్స్‌పై కొనుగోలు చేసిన ఆటోకు కనీసం డీజిల్‌కు సరిపడా డబ్బులు రాకపోవడంతో కిస్తీలు కట్టేదెలా అని ఆటో డ్రైవర్ల మనోవ్యథ, పాదయాత్రలో భాగంగా ఆటోడ్రైవర్ల సమస్యలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి సమస్యలు పరిష్కరిస్తానని ఎన్నికల ముందే హామీ ఇచ్చారు. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వస్తే ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.10 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమచేస్తానని హామీ ఇచ్చారు. దీంతో అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రబడ్జెట్‌లో ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రతి ఏడాది బడ్జెట్ కేటాయించి అర్హులైన ఆటో, ట్యాక్సీ, మాక్సీక్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.10వేలు చొప్పున వారి ఖాతాల్లో జమచేసి ఆదుకున్నారు. దీంతో పాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల బీమా వర్తింపజేసి ఆదుకున్నారు. అలాగే రవాణా వాహనాల కొనుగోలుకు బ్యాంకు నుంచి రుణాలు తీసుకునే డ్రైవర్లకు రూ.3 లక్షల వరకు వడ్డీరాయితీ అందించాలని నిర్ణయం తీసుకున్నారు.

హామీ నెరవేర్చిన జగన్



ఇప్పటివరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆటోడ్రైవర్లను గుర్తించిన నాయకుడు ఎవరూ లేరు. ఎన్నికల ముందు పాదయాత్రలో మా సమస్యలు గుర్తించి అధికారంలోకి రాగానే ఆటోడ్రైవర్లను ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి మాకు ఏడాదికి రూ.10 వేలు అందించి ఆదుకున్నారు. ఆర్థికంగా వెసులుబాటు కల్పించడంతో చాలా సంతోషంగా ఉండేది. మా కుటుంబమంతా ఆయనకు రుణపడి ఉంటాం.

– గొర్లె రామినాయుడు,ఆటోడ్రైవర్

ప్రభుత్వం హామీలు అమలు చేయాలి..



రోజంతా కష్టపడి ఆటో తోలితే నాలుగు డబ్బులు ఇంటికి తీసుకెళ్లే పరిస్థితి లేదు.నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోవడంతో వాటిని కొనుగోలు చేయడానికి నానా ఇబ్బందులు పడుతున్నాం .అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి వాటి ఫైనాన్స్, పెరిగిన బీమా, రోడ్డు ట్యాక్స్‌లు కట్టుకోలేక ఆటోలు నడపలేకపోతున్నాం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు రూ.15 వేలు చొప్పున చంద్రబాబు ఇచ్చి ఆదుకోవాలి.

– సీహెచ్ లోకేష్, బొబ్బిలి రూట్ యూనియన్ అధ్యక్షుడు, రామభద్రపురం

పోషణ భారం..



గడిచిన 20 ఏళ్ల నుంచి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాం. డీజిల్ ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో మా కుటుంబ పోషణ భారంగా మారింది.దీనికి తోడు గతంలో మాదిరి ప్రస్తుతం ఆటోలకు అంతగా గిరాకీ ఉండడం లేదు. ఇలాంటి పరిస్థితి నుంచి ఆటోడ్రైవర్లకు ఆర్థికంగా సాయం చేసి ప్రభుత్వమే కాపాడాలి.

– ఎస్.గంగరాజు, సాలూరు రూట్ యూనియన్ అధ్యక్షుడు, రామభద్రపురం

గంజాయి వ్యాపారులకు ఖబడ్దార్..!

- ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరిక
- ఈ ఏడాదిలో 24కేసుల నమోదు
- 265 వందల కిలోల గంజాయి సీజ్



పట్టుకున్న గంజాయి వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: గంజాయి విక్రయించినా, అక్రమ రవాణా చేసినా, వినియోగించినా నేరమే. దీనిని తీవ్రమైన నేరంగా పరిగణించి, చట్ట పరిధిలో కఠిన చర్యలు చేపడతామని మరోసారి ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం హెచ్చరించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం ఒకవైపు కఠినమైన చర్యలు చేపడుతూనే, మరోవైపు విద్యార్థులు, యువత, ప్రజలకు వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువతలో మార్పు తీసుకువచ్చి, వారిని తిరిగి సన్మార్గంలో నడపాలనే ఉద్దేశంతో వాటి దుష్ప్రభావాలను యువతకు వివరించే చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇక గతేడాదిలో గంజాయి అక్రమరవాణకు పాల్పడుతున్న వారిపై 62 కేసులు నమోదు చేసి, 1656 కిలోల గంజాయి, 70 గ్రాముల నల్లమందు స్వాధీనం చేసుకుని, 218మందిని అరెస్టు చేశామన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 24కేసులు నమోదు చేసి, 265కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 65 మందిని అరెస్టు చేశామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాకు గ్రూపులుగా ఏర్పడి, వ్యాపారాలు సాగిస్తున్న 54మందిని గుర్తించి, గంజాయి కేసుల్లో నిందితులుగా చేర్చామని చెప్పారు. వారిలో 43మంది ఇతర రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారన్నారు. గంజాయి అక్రమ రవాణను నియంత్రించేందుకు జిల్లాలో ఐదు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, నిరంతరం వాహన తనిఖీలు చేపట్టే విధంగా చర్యలు చేపట్టామని అలాగే ప్రతిరోజూ పది ప్రాంతాల్లో డైనమిక్ వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. అంతేకాకుండా, వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడానికి కూడా వెనుకాడబోమని గంజాయి వ్యాపారాలకు పాల్పడే వారిని ఎస్పీ హెచ్చరించారు.

తాటిపూడిలో 200 ఎకరాల్లో భూమాత వెంచర్

- ఉడా అనుమతులతో 5ఫేజ్‌లలో 1650 ప్లాట్స్
- ఎక్కడా లేనివిధంగా క్లబ్‌హౌస్, స్విమ్మింగ్‌పూల్‌తో వెంచర్ ఏర్పాటు
- 'భూమాతాస్ ఎస్ఎన్ స్వప్నలోక్' బ్రోచర్ రిలీజ్



నూతన వెంచర్ 'భూమాతాస్ ఎస్ఎన్ స్వప్నలోక్'ను రిలీజ్ చేస్తున్న భూమాత మేనేజింగ్ మార్కెటింగ్ సభ్యులు

శృంగవరపు కోట: రియల్ ఎస్టేట్ చరిత్రలో ఎవరూ ఇవ్వని సౌకర్యాలు క్లబ్‌హౌస్, స్విమ్మింగ్‌పూల్ సదుపాయాలతో 'భూమాతాస్ ఎస్ఎన్ స్వప్నలోక్' నూతన వెంచర్‌ను వేసినట్లు భూమాత మేనేజింగ్ డైరెక్టర్ తాళ్లూరి పూర్ణచంద్రరావు, ఎస్ఎన్ గ్రూప్ ఛైర్మన్ శ్రీనివాస్ అన్నారు. భూమాత గ్రూప్, ఎస్‌బీఎన్ గ్రూప్ సంయుక్తంగా ఆదివారం విశాఖపట్నంలోని సాయిప్రియ రిసార్ట్స్‌లో 'భూమాతాస్ ఎస్ఎన్ స్వప్నలోక్' బ్రోచరను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వెంచర్ విజయనగరం జిల్లాలోని తాటిపూడి వద్ద సుమారు 200 ఎకరాలలో 5 ఫేజ్‌లలో 1650 ప్లాట్స్ ఉడా అనుమతులతో అందరికీ అందుబాటు ధరలతో విడుదల చేశామని తెలిపారు. ఈ వెంచర్ పూర్తిగా ఒక థీమ్డ్ ప్రీమియం రెసిడెన్షియల్ మెగా ప్రాజెక్ట్‌ను కస్టమర్స్‌కు విశ్రాంతి, వినోదం ఇచ్చే ఇలాంటి భారీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌లో మొదటిదని చెప్పారు. ఈ వెంచర్‌కు ఇప్పటికే విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ వెంచర్‌లో ప్రతిష్టాత్మకంగా ప్రపంచంలోని 7 వండర్స్ తాలూకా కళాకృతులు కస్టమర్స్ సందర్శన కోసం రిసార్ట్ సౌకర్యాలతో పాటు పెట్టడం వల్ల విశేష ఆదరణ ఈ స్వప్నలోక్ ప్రాజెక్టుకు వస్తుందన్నారు. ఈ స్వప్నలోక్ వెంచర్ సమీపంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే తాటిపూడి రిజర్వాయర్‌ను టూరిజం స్పాట్‌గా చేసి అక్కడ బోట్ షికారు పెట్టిందన్నారు.

టూరిజం అభివృద్ధి

త్వరలో 200 ఎకరాల్లో హెలికాప్టర్ ద్వారా హెలిటూరిజం ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ వెంచర్ సమీపంలో 500 ఎకరాల్లో జిందాల్ కంపెనీ వారు టూరిస్ట్ స్పాట్‌గా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారన్నారు. స్వప్నలోక్ వెంచర్ సమీపంలో భవిష్యత్‌లో టూరిజంగా అభివృద్ధికి చాలా అవకాశాలున్నాయన్నారు. ఈ వెంచర్ మీదుగా 4 లైన్ల హైవే పనులు త్వరలో ప్రారంభంకానున్నాయన్నారు. ఈ కార్యక్రమానికి సుమారు 1500 మంది మార్కెటింగ్ సభ్యులు, డైరెక్టర్ తాళ్లూరి శివాజీ, కిరణ్ శంకర్, గోపాల్ హాజరయ్యారు. విజయనగరంలో మార్కెటింగ్ సభ్యుల కోసం ప్రత్యేకంగా మార్చి 23న సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ నెలలో మెగా కస్టమర్ మేళా తాటిపూడి వద్ద స్వప్నలోక్ వెంచర్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు తాళ్లూరి పూర్ణచంద్రరావు తెలిపారు.

కనకమ్మ మృతికి నివాళులు అర్పించిన బొత్స



పొట్నూరు సన్యాసినాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

గుర్ల: దివంగత మాజీ ఎమ్మెల్యే (సతివాడ) పొట్నూరు సూర్యనారాయణ సతీమణి పాలవలస సర్పంచ్ పొట్నూరు కనకమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబసభ్యులైన గుర్ల ఎంపీపీ పొట్నూరు ప్రమీల, వైఎస్సార్‌సీపీ గుర్ల మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడులను మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, జెడ్పీ ఛైర్మన్ బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కనకమ్మ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ తరఫున అండగా ఉంటామని భరోసా కల్పించారు. కనకమ్మకు నివాళులు అర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొత్స సందీప్. కేవీ సూర్యనారాయణ రాజు, జమ్ము స్వామి నాయుడు, కెంగువ పధుసూదనరావు, తోట తిరుపతిరావు, నియోజక వర్గం నాయకులు ఉన్నారు.

వేర్వేరు అగ్ని ప్రమాదాల్లో పశువులపాక, గడ్డివాములు దగ్ధం



రామస్వామిపేటలో అగ్నికి ఆహుతైన గడ్డివాములు



బొద్దాంలో కాలిబూడిదైన పశువుల పాక

వేపాడ: మండలంలోని రామస్వామిపేట, బొద్దాం గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం సంభవించిన వేర్వేరు అగ్ని ప్రమాదాల్లో పశువులపాక, గడ్డివాములు, నీలగిరి తోట అగ్నికి ఆహుతయ్యాయి. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామస్వామిపేటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదంలో పాత్రునాయుడు, ఎ.విజయలక్ష్మి, టి.నాగేష్, జి.తాత, గొలగాని కృష్ణమూర్తికి సంబంధించిన ఐదు గడ్డివాములు పక్కనే ఉన్న నీలగిరి తోట దగ్ధమయ్యాయి. సుమారు రూ.20 వేల నష్టం వాటిల్లింది. అలాగే బొద్దాం రామాలయం సమీపంలో మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన నీలంశెట్టి దేముడమ్మ పశువుల పాక దగ్ధమైంది. కళ్లంలో ఉన్న టేకుదుంగలు, సపోటా చెట్లు కాలిపోయాయి. ప్రమాదం సమయంలో పశువులు మేతకు వెళ్లడం వల్ల వాటికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. సుమారు రూ.30వేల ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రమాదాలపై వీఆర్‌ఓలకు సమాచారం అందించినట్లు బాధితులు తెలిపారు.

1400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



పెదఖర్జ గ్రామ పరిసరాల్లో స్వాధీనం చేసుకున్న సారా నిల్వ చేసిన టబ్బులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పెదఖర్జ గ్రామ పరిసరాల్లో సారా స్థావరం నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి నిర్వహించిన దాడిలో పులియబెట్టిన 1400లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఎల్విన్‌పేట ఎస్సై బి.శివ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన ఈ దాడుల్లో పెద్ద ఎత్తున సారా నిల్వ చేసేందుకు ఉంచిన టబ్బులను కూడా స్వాధీనం చేసుకున్న ఎస్సై ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



బర్లిలో బిందెలు పట్టుకుని నిరసన తెలుపుతున్న మహిళలు

బలిజిపేట: మండలంలోని బర్లి గ్రామంలో గత 20రోజుల నుంచి తాగునీరు అందక అవస్థలు పడుతున్నామని, దాహంతో ప్రజలు అలమటించుకుపోతున్నారని రెండవవార్డు మెంబరు తాడి లక్ష్మమ్మ, మహిళలు తెలిపారు. ఈ మేరకు సీపీఎం, రైతుసంఘం ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు మన్మథరావు, రైతు సంఘం నాయకుడు ఏగోటి కృష్ణమూర్తి, రెండవ వార్డు మెంబరు లక్ష్మమ్మలు మాట్లాడుతూ గడిచిన 20రోజులుగా తాగునీరు అందక బర్లిగ్రామ ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. తాగునీటికి నిరసన చేయాల్సిన పరిస్థితులు వచ్చాయని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే ఎంపీడీఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

ఏపీ ట్రెజరీస్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ ఏకగ్రీవం

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీటీఏఎస్ఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ కాంప్లెక్స్ (ఐఎఫ్‌సీ) భవనంలో కాన్ఫరెన్స్ హాల్‌లో సంఘం రాష్ట్ర కోశాధికారి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. జిల్లా అధ్యక్షులుగా ఎం.ఆదినారాయణ, కార్యదర్శిగా పి.శాంతి కిరణ్‌కుమార్, కోశాధికారిగా పి.వీరన్న దొర, సహాధ్యక్షులుగా ఎం.నూకరాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా వై.కృష్ణశ్రావణ్, ఉపాధ్యక్షులుగా పి.సురేష్‌బాబు, ఎస్.రామకృష్ణ, పి.వరలక్ష్మి, కార్యదర్శులుగా సీహెచ్ రమేష్‌బాబు, ఎం.దుర్గాప్రసాద్, వై.జయశ్రీ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పీవీ నారాయణరావు నూతన కమిటీని ప్రకటించారు.

ఒక పూరిల్లు, మూడు పాకలు దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక శకటం



అగ్నికి ఆహుతైన పూరిల్లు

సీతంపేట: మండలంలోని రేగులగూడ కాలనీలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పూరిల్లు మూడు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో తెలియరావడం లేదని గిరిజనులు తెలిపారు. గ్రామంలో అందరూ కొండపోడు పనులకు వెళ్లిపోయారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో అగ్ని ప్రమాదం సంభవించడంతో సవరలక్ష్మణ్‌కు చెందిన రూ.లక్షా 50 వేల నగదు. రెండు తులాల బంగారం, సామగ్రి కాలిపోయాయి. ఇంట్లో బంధువుల వివాహం ఇటీవల జరగడంతో సారె సామగ్రి, బట్టలు మొత్తం కాలిపోవడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. గ్యాస్, టీవీ, మంచం, 14 బస్తాల ధాన్యం అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో ఆ కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది.సవర రామారావు, సవర లక్కాయి, సవర బెన్నయ్యలకు చెందిన మూడు పశువుల శాలలు, ఒక సైకిల్, ఐటీడీఏ గతంలో ఇచ్చిన పవర్‌వీడర్ దగ్ధమయ్యాయి. స్థానికులతో పాటు కొత్తూరు అగ్నిమాపకశకటం వచ్చి మంటలను అదుపుచేసింది. విషయం తెలుసుకున్న ఆర్ఐ విజయ్‌గణేష్‌తో పాటు సిబ్బంది గ్రామాన్ని సందర్శించి నష్టం దాదాపు రూ.3లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి



వృద్ధురాలు అంకమ్మ మృతదేహం

మెంటాడ: మండలంలోని రెల్లిపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు మృతురాలి మనుమరాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర ఎస్సై కె.సీతారాం తెలిపారు. ఈ ఘటనపై ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వృద్ధురాలు రాళ్లపూడి అంకమ్మ(74) ఒంటరిగా పూరిపాకలో నివసిస్తోంది. వృద్ధురాలు మృతి చెందినట్లు స్థానికులు గమనించి విశాఖపట్నంలో నివాసం ఉంటున్న మనుమరాలు పైల దుర్గకు సమాచారం ఇవ్వడంతో ఆమె వచ్చి మృతిచెందిన వృద్ధురాలి ముక్కు నుంచి రక్తం కారిన మరకలు ఉండడంతో పాటు ముక్కుకు ఉండాల్సిన బంగారు వస్తువులు, ఇంట్లో ఉండాల్సిన కొంత నగదు లేనట్లు గుర్తించి అనుమానాస్పద మృతిగా భావించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని డాగ్‌స్కాడ్‌తో పాటు వేలిముద్రలు నిపుణులతో పరిశీలించి ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.